క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతలకు బాండ్లు అందిస్తున్న సూపరింటెండెంట్

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి ఆత్మకూరుకు చెందిన తోట కేశవవరప్రసాద్ దంపతులు రూ.30వేలు, హైదరాబాద్‌లోని నిజాంపేట్‌కు చెందిన శేషశాయివంశీ రూ.5,150, నంద్యాలకు చెందిన మద్దిలేటి దంపతులు రూ.5వేలు విరాళాలు ఇచ్చారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి బాండ్లు అందజేశారు.

సమస్య పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంగర శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నాగరాముడులు విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 17న విజయవాడలో నిర్వహించనున్న నిరుద్యోగుల ఆవేదన సదస్సు వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి రఘురామమ్మూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ నందికొట్కూరు తాలూకా నాయకులు శేషన్న, పి.రమేష్, విల్సన్, ఆర్.రమేష్, వీర, చిన్న పాల్గొన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యం



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన నృత్యకళా నిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో వినాయకకౌత్వం, దుర్గాస్తుతి, శివశంభో శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు సత్యానందిని, భావన, సుజయరాఘవి, లావణ్య, సంజన తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

భక్తులపై తేనెటీగల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయం సమీపంలో శనివారం 15 మంది భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. వివరాలు..ం ఎమ్మిగనూరుకు చెందిన ఒకే కుటుంబ భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద వెంగమ్మ కొట్టాల వద్ద దాసంగం పెట్టేందుకు వంట చేస్తున్నారు. ఈ క్రమంలో తేనెటీగలు మాధవి, సంగీత, సరస్వతి, లత, అంపయ్య, లక్కీలపై దాడి చేశాయి. అదే సమయంలో పక్కన వెళ్తున్న ఆర్ఎస్ రంగాపురానికి చెందిన మరో 10 మంది భక్తులపై కూడా దాడి చేశాయి. గాయపడిన వారిని బేతంచెర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఉద్యోగుల సంక్షేమం మరిచిన ప్రభుత్వం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో మౌలాలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల సంక్షేమంపై అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం 15 నెలల కాలంలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేక పోయిందని మండిపడ్డారు. మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామని, పీఆర్సీ గడువు ముగిసినా ఇంత వరకు పీఆర్సీ నియమించలేదన్నారు. పదవీ విమరణ చేసిన ఉద్యోగులు పది నెలలుగా గ్రాట్యుటీ కూడా చెల్లించలేదన్నారు. ఎస్ఎస్‌సీ మూల్యాకనం విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు వెంటనే మూల్యాంకన భత్యాన్ని చెల్లించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివశంకర్, గోపాలకృష్ణ, ప్రసాదరెడ్డి, ఇక్బాల్‌బాషా, నంద్యాల జిల్లా ఎస్టీయూ ప్రధాన ఆర్థిక కార్యదర్శులు అజాంబేగ్, శివప్రసాద్, పాల్గొన్నారు.

వదలని వాన



నిండుకుండలా ప్రవహిస్తున్న ప్రవహిస్తున్న భవనాశి



ఇస్కాల గ్రామం వద్ద వర్షపు నీటిలో పంట పొలాలు

- నీటి నుంచి తేరుకోని పైర్లు

పాములపాడు: వరుణుడు ఏకధాటిగా కురుస్తుండటంతో పైర్లు నీటిలోనే మగ్గుతున్నాయి. శనివారం ఉదయం, సాయంత్రం వేళల్లో వర్షం కురిసింది. 10 రోజుల క్రితం కురిసిన వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఇస్కాల గ్రామం వద్ద భవనాశి, చెలిమిల్ల గ్రామం వద్ద సుద్ద వాగు, ఎద్దులంక, వేంపెంట వద్ద ఉన్న వాగులు, భానుముక్కల వద్ద నల్లవాగు, పొంగి ప్రవహిస్తున్నాయి. మద్దూరు వద్ద విప్పలవాగుతో పాటు జీఎన్ఎస్ఎస్ 7వ కిలోమీటరు వద్ద సీపేజీ వాటర్‌తో పక్కనున్న పొలాల్లోకి నీరు చేరింది. ఇప్పటికే కొన్ని పైర్లు పూర్తిగా నీట మునిగి కుళ్లిపోగా, అరకొరగా ఉన్న పైర్లు సైతం వర్షం వల్ల నీటి లోనుంచి తేరుకోలేక కిదపడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

గ్రామాల్లో తేలికపాటి వర్షం

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి వర్షం కురుస్తూనే ఉంది. 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. పగిడ్యాలలో అత్యధికంగా 19.4 మిల్లీమీటలు, మిడుతూరులో అత్యల్పంగా 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. పాములపాడులో 16.8ఎం.ఎం, కొత్తపల్లిలో 10.4ఎం.ఎం, నందికొట్కూరులో 8.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

ఆందోళనలో లోతట్టు కాలనీల ప్రజలు



పాలేరు వద్ద రోడ్డెక్కి ప్రవహిస్తున్న నీళ్లు

మహానంది: ఎడతెరిపినివ్వకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలతో పాటు రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుగ్రామాల్లోని లోతట్టు కాలనీల ప్రజలు, పూరిగుడిసెలు, మట్టిమిద్దెల్లో నివాసం ఉండేవారు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం ఉదయం నుంచి ఫలు దఫాలుగా వర్షం కురిసింది. మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో ఎంసీ ఫారం గ్రామం వద్ద పాలేరు పొంగి ప్రవహించింది. నల్లమలలో కురిసిన వర్షపు నీరంతా పాలేరుకు చేరడంతో వాగుపైకి ఎక్కి ప్రవహిస్తోంది. దీంతో మహానంది నుంచి గాజులపల్లె, గిద్దలూరు మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుక్కాపురం వద్ద ఉన్న ఇంజవాణి చెరువు సైతం అలుగు దాటి ప్రవహిస్తోంది.

ఆత్మకూరులో 27.8 మి.మీ. వర్షం



ఆత్మకూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిలిచిన వర్షపునీరు

ఆత్మకూరు: మండలంలో శనివారం విస్తారంగా వర్షాలు కురిశాయి. రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం 27.8 మి.మీ. వర్షం కురిసింది. భవనాశి, సుద్దవాగు, రాళ్లవాగు, గుండ్లకమ్మ వాగులు పొంగి ప్రవహించడంతో వర్షపునీరు పట్టణ శివారు కాలనీలను, పంట పొలాలను ముంచెత్తడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం కురిసిన వర్షానికి మరింతగా భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎడతెరిపి లేని వర్షాలతో కోత దశలో మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టి పీడిస్తున్న జ్వరాలు



రోగికి ఇంజక్షన్ ఇస్తున్న వైద్య సిబ్బంది

పాములపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. 20 రోజుల నుంచి జ్వరాలు తగ్గడం లేదు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీ, గ్రామాల్లోని ఆర్ఎంపీల వద్దకు ప్రజల క్యూకడుతున్నారు. స్థానిక పీహెచ్‌సీలో రోజుకు 100కు పైగా ఓపీ ఉందంటే పరిస్థితి అర్థమతుంది. వైరల్ ఫీవర్, టైఫాయిడ్, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు వంటి రోగాలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వ్యాధుల విషయమై వైద్యురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని వడబోసుకుని తాగాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలన్నారు. ఏ మాత్రం నలతగా అనిపించినా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు.

అంబేడ్కర్ భవన్ ఏర్పాటు చేయాలి

పగిడ్యాల: నందికొట్కూరు నియోజకవర్గంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్, ఎస్సీ కమిటీ హాల్ ఏర్పాటు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పుట్టపోగు విజయుడు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రేపటి నుంచి గాలి కుంటు వ్యాధి టీకాలు

బండిఆత్మకూరు: ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు వెటర్నరీ డాక్టర్ అనూష తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 15న బండి ఆత్మకూరు, సింగవరం, 16న ఎర్రగుంట్ల, రామాపురం, 17న చిన్న దేవళాపురం, సోమయాజులపల్లి, 18న నారాయణాపురం, ఈర్నపాడు, 19న సంతజూటూరు, పార్నపల్లి, 20న పెద్దదేవళాపురం, కాకనూరు, 22న పరమటూరు, వెంగళరెడ్డి పేట, 23న భోజనం, కడమల కాలువ, 24న లింగాపురం, బి.కోడూరు, 25న జీసీ పాలెం, ఏ.కోడూరు గ్రామాల్లో పశువులకు టీకాలు వేయనున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇచ్చిన హామీలు మరిచిన లోకేష్

జూపాడుబంగ్లా: యువగళం పాదయాత్రలో జైన్ ఇరిగేషన్ పరిశ్రమ వద్ద సెల్ఫీలు దిగిన నారా లోకేష్.. తాము అధికారంలోకి వస్తే పరిశ్రమలను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని మరిచినట్లున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్ బాబు ఎద్దేవా చేశారు. శనివారం ఆయన తంగడంచలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మభ్యపెట్టి 2015లో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విలువైన తంగడంచ ఫారం భూములను జైన్‌కంపెనీకి అతితక్కువ ధరకు కట్టబెట్టి మోసం చేశారన్నారు. భూములు తీసుకున్న వారు పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో బీడు భూములుగా మారాయన్నారు. ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా కెమికల్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయటం తగదన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు సలీం, నాగరాజు, వలి, చెంచన్న, రాజు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం చేస్తున్నామని సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయలోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ కాదగిన కేసులను న్యాయవాదులు, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో పరిష్కారం చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే 385 కేసులను పరిష్కారించామని, వాటికి నష్టపరిహారాన్ని రూ.8,79,126 అందించామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.శరభయ్య, ఏపీపీ సుస్మిత పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 697 కేసులు పరిష్కారం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో వివిధ రకాల రాజీ పడదగిన కేసులు 697 పరిష్కారమయ్యాయి. నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ తంగమణి, ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో జరిగిన మెగా లోక్ అదాలత్‌లో ఎస్‌టిసి కేసులు 565, బ్యాంకు కేసులు 52, ఎంసి 1, డివిసి 1, ఎక్సైజ్ కేసులు 48, క్రిమినల్ కేసులు 18, సివిల్ కేసులు 12 పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదులు మాణిక్యరావు, బలరాంనాయక్, సుధాకరరెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భూతగాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

- ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్



మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్

జూపాడుబంగ్లా: భూతగాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. శనివారం సాయంత్రం తంగడంచ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో డీఎస్పీ మాట్లాడుతూ భూములు కొనుగోలు చేసేటప్పుడు, విక్రయించేటప్పుడు వాటికి సంబంధించిన రికార్డులు పక్కాగా పరిశీలించుకోవాలన్నారు. ఏవైనా తగాదాలు ఎదురైనప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. పరిష్కారం కాకపోతే ఘర్షణలకు పాల్పడకుండా కోర్టులను ఆశ్రయించాలన్నారు. అవాంఛనీయ ఘటలకు పాల్పడినా, ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వటం చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయిలకు 20 ఏళ్లు, అబ్బాయిలకు 22 ఏళ్ల వయస్సు వచ్చే వరకు వివాహాలు చేయరాదన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ మల్లికార్జున పాల్గొన్నారు.

శ్రీశైలం హరిత రిసార్ట్‌ను పరిశీలించిన చైర్మన్

శ్రీశైలంటెంపుల్: ఏపీ టూరిజం ఆధ్వర్యంలో శ్రీశైలంలోని హరిత రిసార్ట్‌లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పరిశీలించారు. శనివారం ఆయన శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం టూరిజం హరిత రిసార్ట్‌కు చేరుకుని పనులను పరిశీలించి పలు సలహాలిచ్చారు. భక్తులకు మెరుగైన వసతులు, ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఆయన వెంట యూనిట్ మేనేజర్ పవన్ కొణిదెల, డీఈ శ్రీనివాస్ యాదవ్, ఏఈ రామకృష్ణారెడ్డి, టూరిజం శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహానందిలో..

మహానంది: ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ శనివారం మహానందీశ్వరస్వామిని, కామేశ్వరీ దేవిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక వసతి గృహాలను, రెస్టారెంట్‌ను పరిశీలించారు. ఏపీ టూరిజం వసతిగృహాలు, రెస్టారెంట్‌కు మంచి ఆదరణ ఉందని, రెనోవేషన్‌కు సహకరించాలని డీవీఎం జి.లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేయగా చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు శంకర్

ఆత్మకూరు: ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు శంకర్, సహాయ అధ్యక్షులు ఉమ్మర్ కోరారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం ఒక్క డీఏ కూడా మంజూరు చేయకపోవడం తగదన్నారు. దసరా కానుకగా డీఏలు మంజూరు చేసి, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలన్నారు. దీర్ఘకాలంలో పెండింగ్‌లో ఉన్న రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిలను ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులకు దశలవారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2003లో డీఎస్సీ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల బోధనలకు ఆటంకంగా మారిన యాప్‌లను తొలగించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు భూషణ్, సుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, పెరుమాళ్ల దాసు, జెడ్.దాసు, వెంకటేశ్వర్లు, హరీఫ్‌బాషా, అంబయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

22 నుంచి బేస్‌బాల్ రెఫరీ క్లినిక్ జడ్జీల శిక్షణ శిబిరం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు బేస్‌బాల్ రెఫరీ క్లీనిక్ జడ్జీల శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా బేస్‌బాల్ క్రీడా సంఘం సభ్యులు సుబ్బయ్య, రమణయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బేస్‌బాల్ రెఫరీపై ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఎస్ఏ పీడీ, పీఈటీలు శిక్షణలో పాల్గొనవచ్చన్నారు.ఈనెల 18వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ : 9885858183 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రక్తదానం

నంద్యాల(అర్బన్): తలసేమియా చిన్నారులు, గర్భిణులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో వంద మంది సిబ్బంది శనివారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డెయిరీ ఆవరణలో చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు సామాజిక బాధ్యతగా రక్తదానం చేశారు. డెయిరీ ఎండీ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ నంద్యాల బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో ఏటా ఉద్యోగులు తలసేమియా చిన్నారులు, గర్భిణులకు అవసరమైన రక్తాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఆంధ్రా చెస్ సంఘం, నంద్యాల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ బ్లిట్స్ విభాగాల్లో చెస్ పోటీలను శనివారం ప్రారంభించినట్లు నంద్యాల జిల్లా సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ బ్లిట్స్ టోర్నమెంట్ మునినాగలక్ష్మి, రాజేష్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సోమేల నాగరాజు, జనార్ధన్, డాక్టర్ నీల ప్రసాద్, టోర్నమెంట్ నిర్వాహకులు సుజాత పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను విస్తృతం చేయాలి



విస్తృత సేవలు అందించిన ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పోస్టల్ బ్యాంకింగ్ సేవలను గ్రామాల్లో విస్తృతం చేయాలని నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ అప్పలస్వామి సూచించారు. స్థానిక పోస్టాఫీసులో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథ్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అప్పలస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోస్టల్ శాఖలో ఉన్న పొదుపు ఖాతాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు పోస్టాఫీసులను, పోస్టల్ సేవలను పొందేలా పనిచేయాలన్నారు. ఎస్‌బీ, ఆర్‌డీ, సుకన్య సమృద్ధి, ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐ, బీమా, ఐపీపీబీ తదితర పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఖాతాలకు ఎన్‌పీసీఎల్ లింక్ చేసుకునేలా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ స్థాయిలో పోస్టల్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఆన్‌లైన్ ఎలా ఉపయోగపడుతుందో ఐపీపీబీ మేనేజర్ శ్రీనివాసులు వివరించారు. అనంతరం గత ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. సబ్ పోస్టుమాస్టర్లు, బ్రాంచి పోస్టుమాస్టర్లు పాల్గొన్నారు

భాద్రపద మాస పూజలు



మద్దిలేటిస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సందడి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించి, స్వామివారి ఇష్టమైన వరపూజ చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉప కమిషనర్, ఈఓ. రామాంజనేయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

రేపు వాహనాల వేలం

నందికొట్కూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 15న వేలం వేయనున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సందర్భాల్లో మూడు వాహనాలను సీజ్ చేశామని, వాటికి నిర్వహించనున్న వేలంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు ముందుగానే ధరావతు చెల్లించాలన్నారు.

ప్రయాణం.. నరకయాతన



కోతకు గురై ప్రమాదకరంగా మారిన ఎంఎన్ ఘణపురం రోడ్డు



బీటీ కొట్టుకుపోయి మట్టి తేలిన తూర్పు ప్రాతకోట-ఘణపురం గ్రామాల రోడ్డు



ఒక వైపు రాళ్లు, మరో వైపు గుంతలమయమైన ఎం. ఘణపురం రోడ్డు దుస్థితి

- గుంతలమయమైన ప్రాతకోట- ఘణపురం రోడ్డు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మలుపు వద్ద కోతకు గురైన ఎన్.ఘణపురం రహదారి

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట - ఘణపురం బీటీ రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా తయారైంది. ఈ రహదారిపై ప్రయాణం సాగించేందుకు ప్రయాణికులు నరకయాతనను అనుభవిస్తున్నారు. తరచూ టూ వీలర్, త్రీ వీలర్ వాహన చోదకులు, పాదాచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 16 నెలలు గడుస్తున్నా బీటీ రహదారుల అభివృద్ధికి అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే బీటీ రహదారులు, సీసీ రోడ్లు వేయించి అభివృద్ధి ఏమిటో చూపిస్తానని ప్రగల్భాలు పలికిన స్థానిక ఎమ్మెల్యే కూడా.. వాటి ఊసే ఎత్తకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెహ్రూనగర్, సంకిరేణిపల్లె, పగిడ్యాల, లక్ష్మాపురం రహదారులు కూడా అధ్వాన్నంగా తయారయ్యాయి. ప్రస్తుతం ఎడతెరిపి లేని వర్షాలకు రోడ్ల దుస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.